ప్రజాశక్తి

బుధవారం 1 మార్చి 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బీచ్ రోడ్డులో సాగుతున్న పనులు

అన్నీ అచ్చోటనే..

- తీరానికే పరిమితమైన అభివృద్ధి పనులు
- నగరంలో రోడ్లకు మోక్షం కరువు
- రూ.82 కోట్లకుపైగా జివిఎంసిపై భారం
- జి-20 సదస్సుకూ నిధులు విదల్చని కేంద్రం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అభివృద్ధి అంటే ఒకే చోటన రూ.కోట్లు కుమ్మరింపజేయడమే పాలకులకు తెలిసిన మంత్రమా ? అనేలాగ 15 రోజులుగా విశాఖ తీరంలో పనుల హడావుడి సాగుతోంది. ఇక్కడ ఏ జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించినా.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. డవలప్‌మెంట్‌ను బీచ్ ఏరియాకే పరిమితం చేసి పనిచేయడం ఒక అలవాటుగా మారిపోయింది. సదస్సులకు వచ్చే ప్రతినిధులు తిరుగాడే ప్రాంతాలకే ఈ పనులు పరిమితమవుతున్నాయి. పాలనలో తనది ప్రత్యేక ముద్ర ఉంటుందంటూ ప్రచారం చేసుకుని గద్దెనెక్కిన వైఎస్ జగన్ పార్టీ కూడా గత పాలకుల మూస పద్ధతినే ఎంచుకోవడం తాజాగా విశాఖలో చర్చనీయాంశమైంది.

ఇప్పటికే విశాఖ వాసులపై పన్నుల భారాన్ని జివిఎంసి మోపుతోంది. చెత్త పన్ను, ఇంటి పన్నులతో నగర జీవుల నెత్తిన పెను భారాలను మోపుతూ ప్రజల వ్యతిరేకతను పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం నగర పాలక సంస్థ పన్నుల విధానంతో వెళ్తోంది. తాజాగా ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖలోని ఎయు ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో తలపెట్టిన గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సుకు, ఈ నెల మిగతా 2లో..

భూముల అప్పగింతకే సదస్సులు

- 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్.బి.గంగారావు

విశాఖలోని విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లు, జి-20 సమావేశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయని సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్‌పై ఆయన స్పందిస్తూ... జివిఎంసి సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైందని అన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపగా వచ్చిన సంపదను ఇలా దుర్వినియోగం చేయడం తగని పనని మండిపడ్డారు. 'ప్రభుత్వ రంగం నిలదొక్కుకోవాలి. కొత్త పరిశ్రమలు రావాలి. ప్రజలకు జీవన భద్రత ఉండాలి. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించకుండా ఈ హంగామా దేనికోసం?' అంటూ గంగారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో టిడిపి కాలంలోనూ ఈ తరహా హైడ్రామా నడిచిందని గుర్తు చేశారు. ఒకవైపు విశాఖకు రాజధాని పేరుతోనూ, మరోవైపు ఈ కొత్త సదస్సులతోనూ వైసిపి ప్రభుత్వం ఏమీ సాధించలేదని అన్నారు.

విజయనగరంలో ప్రచారం నిర్వహిస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం వార్త 8లో..

సమావేశమని పిలిచి.. ఎన్నికల ప్రచారం

▸ వార్త మెయిన్‌లో...

ప్రజా ఉద్యమంతోనే ఉక్కు పరిరక్షణ

▸ వార్త 2లో..

తుది ఉత్తర్వులకు లోబడి ఉండాలి

- హయగ్రీవ నిర్మాణాలపై హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి : విశాఖ జిల్లా యండాడ గ్రామంలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ చేస్తున్న నిర్మాణాలను నిలిపివేయాలని జివిఎంసి కమిషనరు ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే విధించింది. అయితే కమిషనరు జారీ చేసే తుది ఉత్తర్వులకు లోబడి ఆ సంస్థ నిర్మాణాలు ఉంటాయని పేర్కొంది. కమిషనరు ఇచ్చిన నోటీసుకు రెండు వారాల్లో వివరణ ఇవ్వాలని హయగ్రీవ సంస్థకు ఆదేశాలు జారీ చేస్తూ జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ మంగళవారం ఆదేశించారు. ఆ సంస్థ ఇచ్చే వివరణ ఆధారంగా మూడు వారాల్లో తుది ఉత్తర్వులు జారీ చేయాలని జివిఎంసి కమిషనరుకు ఉత్తర్వులు జారీ చేశారు. యందాడలోని 12.51 ఎకరాల్లో హయగ్రీవా ఫార్మ్స్ అండ్ డెవలపర్స్ నిర్మాణాల్లో లోపాలున్నాయని, మిగతా 2లో..

అభివాదం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

జీతాలు సకాలంలో అందక ఇబ్బందులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - సీతమ్మధార : ప్రభుత్వ కార్యక్రమాల విజయవంతానికి అహర్నిశలూ కష్టపడుతున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్య నారాయణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన మంగళవారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ, ఎస్ఎల్ వంటి ఆర్థిక ప్రయోజనాలను నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం వల్ల మిగతా 2లో..

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను విజయవంతం చేయండి

జిల్లా కలెక్టర్ మల్లికార్జున

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ - 2023ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనా సమావేశ మందిరంలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు - 2023 ఏర్పాట్లు, అధికారులు చేపట్టవలసిన పనులపై పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన, సచివాలయాల డైరెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్‌లతో కలసి లైజనింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని మార్చి 3, 4 తేదీలలో నిర్వహిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సుకు నియమించిన నోడల్ అధికారులందరూ బాధ్యతాయుతంగా పని చేసి విజయవంతం చేయాలన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంబాసిడర్లు రానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. అతిథులు బస చేసే హోటళ్ల వద్ద, విమానాశ్రయం వద్ద, ఎయు గ్రౌండ్‌లోనూ వైద్య ఆరోగ్య శాఖ నుంచి మెడికల్ టీంలు, ఆంబులెన్స్, మందులు అందుబాటులో పక్కాగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రతినిధులు బస చేసే హోటళ్ల వద్ద సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ కమిషనర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ సదస్సుకు ముఖేష్ అంబానీ, నవీన్ మిట్టల్, అదానీ తదితర ప్రముఖ వ్యాపారవేత్తలు, అంబాసిడర్లు, పారిశ్రామిక వేత్తలు హాజరుకానున్నట్లు చెప్పారు. అధికారులకు అప్పగించిన విధులను బాధ్యతతో నిర్వహించి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే పారిశ్రామికవేత్తలను విమానాశ్రయంలో రిసీవ్ చేసుకోవాలని, వారికి అవసరమైన వాహనాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథుల సమాచారం ముందుగా తెలుసుకొని పూర్తి సన్నద్ధతతో ఉండాలన్నారు. సమావేశంలో సమ్మిట్‌లో పాల్గొనే నోడల్ అధికారులు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

అన్నీ అచ్చోటనే..

28, 29, 30 తేదీల్లో నిర్వహించతలపెట్టిన జి-20 దేశాల సదస్సుకు విశాఖనగరం ముస్తాబవుతోంది. కేంద్రంలోని బిజెపి సర్కారు నుంచి ప్రత్యేకంగా ఒక్క పైసా కూడా మహా విశాఖ నగరపాలక సంస్థ (జివిఎంసి)కి అందలేదు. రాష్ట్ర ప్రభుత్వంది అదే దారి. జి-20 దేశాల సదస్సు నిర్వహణ బాధ్యతలనే కేంద్రంలోని బిజెపి తీసుకున్నట్లు తెలుస్తోంది. నిధుల బాధ్యతను మాత్రం జివిఎంసికే వదిలేయడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. తాజా పనులతో రూ.82 కోట్లకుపైగా భారం జివిఎంసిపై పడనుందని తెలుస్తోంది. మరోపక్క జివిఎంసిపై కార్పొరేటర్లంతా (వైసిపి సహా) చేసే విమర్శలను చూస్తే... వార్డుల్లో ప్రగతి కానరావడం లేదని, రోడ్ల ఏనాటి నుంచో భారీగా గండ్లు పడి వాహనాలు చిక్కుకుంటున్నాయంటూ మొరపెడుతున్నా పాలకులకు పట్టడం లేదు.

నగరానికే పేరొస్తుందంట?

విశాఖ నగరానికే పేరు వస్తుందని పేర్కొంటూ పనులు జరిగితే అభివృద్ధిగా చూపించి పబ్బం గడుపుకునే పనిలో అధికార వైసిపి నేతలు ఉన్నారు. అయితే ఎక్కడ పనులు జరుగుతున్నాయి ? అన్న విషయాన్ని పరిశీలిస్తే.. అంతా అచ్చోటనే అన్న విధంగా... సాగర తీరం చుట్టూ మాత్రమే రోడ్ల గుంతలు కప్పడం, గోడలకు సున్నాలు వేయడం, డివైడర్లకు, ఫుట్‌పాత్‌లకు రంగులు వేయడం మినహా చేస్తున్న పనులేవీ కానరావడం లేదు. గతంలో చంద్రబాబు హయాంలో సిఐఐ సదస్సులు జరిపి రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన సంగతి తెలిసిందే. బీచ్ రోడ్డులో భవనాలకు రంగులు వేసేసి ఇదే అభివృద్ధి అంటూ ఊదరగొట్టిన చరిత్ర తెలుగుదేశం పార్టీకి ఉంది. వరుసగా మూడు దఫాలుగా ఈ సదస్సులు జరగ్గా జాతీయ, అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లు కొంతమంది వచ్చిన మాట నిజమే అయినా ఒక్కటంటే ఒక్కటి చెప్పుకోదగ్గ పరిశ్రమా రాలేదంటూ విశాఖకు చెందిన యువత తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. తాజాగా ఏపి ప్రభుత్వం అదే తంతు సాగిస్తుందా ? ఏమైనా ప్రయోజనం ఉంటుందా ? అన్న విషయమూ కొద్ది రోజుల్లో తేలనుంది.

ప్రపంచంలో పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను నష్టపరిచిన అదానీ సంస్థకు విశాఖలో ద్వారాలు తెరిచి.. మధురవాడలో భూమిని రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి, ఆ పనుల కోసం తాపత్రయపడుతోంది మినహా దేశ ప్రతిష్టను ఆర్థికంగా, రాజకీయంగా నష్టపరచిన అదానీకి ఎర్రతివాచీ పరచి పెట్టుబడుల కోసం అర్రులుచాచడం తప్పు అన్న విషయం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ గుర్తెరగకపోవడం విచారకరం. విశాఖలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలే విశాఖను దేశంలోనే అతిపెద్ద వ్యాపార, వాణిజ్య కేంద్రంగా దశాబ్దాల తరబడి నిలబెడుతుండగా, వాటిని నిలబెట్టే పనులకు శ్రీకారం చుట్టకుండా కొత్త పరిశ్రమలు వచ్చేస్తున్నాయంటూ ఊదరగొట్టే పనిని రాష్ట్ర ప్రభుత్వం నెత్తినెత్తుకుంది.

జీతాలు సకాలంలో అందక ఇబ్బందులు

పలువురు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరలు విపరీతంగా పెరిగిపోతున్న నేటి పరిస్థితుల్లో డిఎ బకాయిలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇటీవల ఉద్యోగులపై పనిభారం ఎక్కువైందన్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు విషయమై అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రమణ, తదితరులు పాల్గొన్నారు.

తుది ఉత్తర్వులకు లోబడి ఉండాలి

వాటి నిర్మాణాలను ఆపేయాలని పేర్కొంటూ కమిషనరు నోటీసులు ఇచ్చారు. దీనిని ఆ సంస్థ సవాల్ చేసిన పిటిషన్‌లో పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు పిటిషన్‌పై విచారణను మూసేసింది.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు పటిష్ట పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3, 4 తేదీల్లో ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ గ్రౌండ్స్‌లో జరగబోయే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు సంబంధించిన భద్రతా పనులను నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మంగళవారం పర్యవేక్షించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమ్మిట్‌కు విచ్చేయనున్న దేశ విదేశాల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు, ప్రముఖుల భద్రత కోసం ఇప్పటికే 2500 మంది సిబ్బందితో సిద్ధంగా ఉన్నామన్నారు. వారు ప్రయాణించే మార్గాలలో, ఎంజిఎం పార్క్ వద్ద, వేదిక ప్రాంగణంలో పూర్తి స్థాయిలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమ్మిట్ జరిగే రెండు రోజులూ నగర పౌరులు ప్రత్యామ్నాయ మార్గాలను గమనించాలన్నారు. విమానాశ్రయం నుంచి ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల వరకూ, అలాగే బీచ్ రోడ్‌లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయన్నారు. శుక్ర, శనివారాల్లో బీచ్‌కు వచ్చే వారు తమ వాహనాలను ఎపిఐఐసి గ్రౌండ్స్‌లో పార్కింగ్ చేసుకోవాలని తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

ప్రజా ఉద్యమంతోనే ఉక్కు పరిరక్షణ

ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి సత్యవతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు ప్రైవేటీకరణ విధానం నుంచి కాపాడుకోవాలంటే ప్రజా ఉద్యమం ద్వారానే సాధ్యమని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు మంగళవారానికి 698వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐద్వా కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో నాడు రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమం జరిగిందన్నారు. 32 మంది బలిదానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వేలాది ఎకరాల భూమిని త్యాగం చేసి స్థానికులు నిర్వాసితులయ్యారన్నారు. ఇంత చారిత్రక నేపథ్యంగల స్టీల్‌ప్లాంటును అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. రెండేళ్లుగా సాగుతున్న ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశంలో స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలే దేశానికి పట్టుగొమ్మలని పేర్కొన్నారు. అటువంటి సంస్థలను బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టడం దారుణమన్నారు. మోడీ సర్కారు నిరుద్యోగ సమస్యను పరిష్కరించాల్సిందిపోయి పెంచుతోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు ఉంటేనే మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్ ఉండదని తెలిపారు.

నినాదాలు చేస్తున్న ఐద్వా నాయకులు

ఉత్తరాంధ్ర అభివృద్ధి స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి ఉందని అన్నారు. కార్యక్రమంలో సంఘం జగదాంబ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మణి, ఆర్.వరలక్ష్మి, నాయకులు బి.సత్యవతి, లక్ష్మి, మహేశ్వరి, ఆదిలక్ష్మి, కె.లక్ష్మి పాల్గొన్నారు.

ఏర్పాట్లును పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి తదితరులు

జి - 20 సదస్సు పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జి - 20 సదస్సు పనుల పురోగతిని సంబంధిత గుత్తేదారుని అడిగి నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలుసుకున్నారు. మంగళవారం, ఆమె ఆర్కే బీచ్ నుండి వైఎంసిఏ వరకూ చేపడుతున్న వివిధ ఇంజినీరింగ్, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కట్టుమురి సతీష్, జివిఎంసి వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మార్చిలో జి - 20 సదస్సును విశాఖ నగరంలో నిర్వహిస్తున్నందున నగర సుందరీకరణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎంతోమంది దేశ, విదేశాల నుంచి అతిథులు నగరానికి విచ్చేసిన సందర్భంగా వారికి ఎటువంటి లోటుపాట్లు, అసౌకర్యమూ కలగకుండా చూడాల్సిన బాధ్యత మనదేనన్నారు.

పారిశ్రామిక కారిడార్లపై ఆశలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం - చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు వంటి మూడు పారిశ్రామిక కారిడార్లను పెద్ద పెట్టుబడి అవకాశాలుగా ప్రభుత్వం భావిస్తోందని విఎంఆర్‌డిఏ ఛైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల పేర్కొన్నారు. వైసిపి జిల్లా కార్యాలయంలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లక్షలాది మంది యువతకు పెట్టుబడులు తీసుకురావడంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించడమే గ్లోబల్ ఇన్వెస్టర్ల సదస్సు ముఖ్య లక్ష్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో వివిధ రంగాల్లో వ్యాపారం చేసేందుకు దాదాపు 20 దేశాలు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఇసుజు వాహనాలు అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి సహకారంతో విఐడబ్ల్యుఎన్‌సిఒ లిమిటెడ్ వారు సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి రూ.27.23 లక్షల విలువైన రెండు ఇసుజు వాహనాలను పోలీసు శాఖకు అందించారు. ఈ వాహనాలను మంగళవారం నగర ఆర్మ్‌డ్ రిజర్వు ఆఫీస్ వద్ద నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్, జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఇతర ఉన్నతాధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజలకు మరింత సమర్ధవంతమైన సేవలు అందించడానికి ఈ వాహనాలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు.

మహారాజశ్రీ విశాఖపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP.86/2013 in O.S.1127/2010
పిటీషన్ :
దుద్దుకూరి మల్లిఖార్జునరావు ...D.Hr
అండ్
A.రాములమ్మ ...J.Dr
వేలం ప్రకటన
ఇందలి D.Hr అగు D.మల్లి ఖార్జున రావు గారు తనకు రావలసిన బాకీ సొమ్ము గురించి J.Dr కు చెందిన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం కోరగా, కోర్టువారు ఆస్తి వేలం కోరకు ఆర్డరు చేసియున్నందున **తేది. 16-03-2023**న పై కోర్టు వారి సమక్షములో క్రింది షెడ్యూలు ఆస్తిని వేలం వేయుదురు. కావున అసక్తిగల వ్యక్తులు ముందుగా ఆస్తిని చూచుకొని **తేది.16-03-2023**న **ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరయి వేలంలో పాల్గొనవచ్చునని ఇందు మూలంగా యావన్మందికీ తెలియ జేయడమైనది.
షెడ్యూలు ఆస్తి వివరములు
విశాఖ జిల్లా, పెందుర్తి SRO పెందుర్తి గ్రామం, జి.వి.యం.సి. పరిధి, RCC స్లాబ్ ఇల్లు, 2 అంతస్తుల ఇల్లు, డోర్. నెం. 17-72/1, ఇల్లు, మరియు ఖాళీ జాగాతో కలిపి 193-4 చ॥గజాలు, సర్వే నెం.129కు **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** లాలం శ్రీరాములు ఇల్లు, **పడమర:** A. త్రిమూర్తి గారి ఇల్లు, **ఉత్తరం:** లాలం పైడయ్య ఇల్లు.
D.Hr Value : Rs.10,00,000/-
Amin Value : Rs. 10,00,000/-
V.V. RAMANA PRASAD, Advocate
Pendurthi, Visakhapatnam
Cell : 9346650651

IN THE HONOURABLE COURT OF ADDITIONAL SENIOR CIVIL JUDGE AT ANAKAPALLE.
I.A. /2023 in H.M.O.P.99 of 2022.
Between:
Dhuda Bangararaju ... **Petitioner**
And:-
Dhuda Yelmaji @ Kalyani
...**Respondent**
To,
Dhuda Yelmaji @ Kalyani, w/o Bangarraju, d/o late Garikina Satyanaryana, residing at D.No. 16-22-17, Near Ambedkar statue, Puliraju Veedhi, beside Arch, Jalaripeta, Visakhapatnam-530001 present at D.No.16-11-2, Relli Veedhi, Paindorapeta, Visakhapatnam-530005.
NOTICE / SUMMONS
The Petitioner filed the above HMOP For restitution of conjugal rights and for other reliefs and the above HMOP stands posted to dt.16-03-2023 for your appearance. Hence you are here by directed to appear either personally or through your counsel on that day before the above court, and if you fail to appear on or before **10.30 A.M. on DT.16-03-2023** the matter will be proceeded in your absence.
Chappa Appala Naidu,
Advocate,
Vizianagaram.
Anakapalle, **Ph:-8179498478,**
Dt.16-02-2023. **8523890499.**

IN THE HON'BLE COURT OF THE VI ADDL.SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
I.A. 497/2022 in O.S. 1137/2015
Between :
Petla Govind ...Petitioner/Plaintiff
And:
Saragada Chinnamma (died) & others
...Respondents/Defendants
NOTICE
To,
R-3: Saragada Suribabu, S/o. Late Nooka Raju, Hindu, aged 40 years, R/at D.No. 50-76-7, Ganesh Nagar, Seethammapeta, Visakhapatnam-16,
R-5: Bora Appalanarasamma, W/o. Sriramulu, Hindu, aged 48 years, R/at D.No. 50-79-8, Ganesh Nagar, Seethammapeta, Visakhapatnam-16,
Take notice that an application U/Or. 22 R.9 (2) R/W Sec.151 CPC R/W Sec.5 of the Limitation Act filed by the petitioner in the above proceedings and is posted for hearing at **10:30 A.M on 16-03-2023** before this Court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause the matter will be decided in your absence and exparte.
S.N. ACHANTA,
Advocate
Visakhapatnam,
Cell: 9989717778.

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE, AT: VISAKHAPATNAM
A.S. 49/2022
Between:
1) **State Bank of India,** **SARB**, Visakhapatnam,
2) **State Bank of India,** Rednam Gardens, Visakhapatnam
...Appellants
And:
Smt. Rettiganti Lakshmi & 2 others
...Respondents
NOTICE
To,
R-2: Smt. Chukkala Latha, W/o. Sri Rama Murthy, Hindu, aged about 52 years, R/at D.No.36-92-240/8, Srinivasa Nagar, Kancharapalem, Visakhapatnam-530008.
R-3: Sri Chukkala Rama Murthy, S/o. late Appanna, Hindu, aged 60 years, R/at D.No.36-92-240/8, Srinivasa Nagar, Kancharapalem, Visakhapatnam-530008.
Please take notice that the above Appellant has filed the Appeal against all of you. The above matter stands posted to **20-03-2023** for your appearance either in person or through a pleader on the above said date i.e. **20-03-2023** in the said Court at **10:30 A.M** to answer the claim failing which the matter will be disposed as per law.
(By Order of the Hon'ble Court)
K.M.GUPTA
K.VAMSI KRISHNA
Advocates,
Visakhapatnam

24 గంటలూ..మద్యం అమ్మకాలు

బార్లకు పట్టని సమయపాలన
స్థానికులకు చుక్కలు చూపిస్తున్న మందుబాబులు

ప్రజాశక్తి-సీతమ్మధార : నగరంలోని బార్లలో మద్యం అమ్మకాలకు సమయపాలన లేదు. బార్ల యజమానులు 24 X 7 విచ్చలవిడిగా లిక్కర్ అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. తాగునీరు దొరకని ప్రాంతమైనా ఉంటుందేమోకానీ మద్యం దొరకని చోటు లేదంటే అతిశయోక్తికాదు. మద్యం నిషేధిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏరులై పారిస్తోంది. నగరంలో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న సాయికృష్ణ బార్ 24 గంటలూ తెరిచే ఉంటోంది. దీనిలో పూటుగా తాగిన మందుబాబులు కిక్కు ఎక్కువై రోడ్డుపైకి వచ్చి ఎక్కడికక్కడ పడిపోతున్నారు. వీరిపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. డైమండ్ పార్క్ వద్ద గణేష్ బార్ ఉంది. పార్కును తెల్లవారుజామున వాకర్స్ ఎక్కువగా వినియోగిస్తుంటారు. తెల్లవారు జామునే గణేష్ బార్‌లో పూటుగా తాగి పార్కులోకి వస్తున్న మందుబాబులు వాకర్స్‌తో గొడవపడుతున్నారు. కాంప్లెక్స్ వద్ద గల సరిగమ రెస్టారెంట్ అండ్ బార్ తెల్లవారుజామునే తెరిచి మద్యం విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతం నిత్యం పాదచారులు, ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఇటువంటి ప్రాంతంలో తెల్లవారేసరికి మద్యం దొరుకుతుండటంతో తాగిన మందుబాబులు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

నిబంధనల ప్రకారం బార్ అండ్ రెస్టారెంట్లను ఉదయం 10 గంటలకు తెరిచి రాత్రి 11 గంటలకు మూసివేయాలి. కానీ ఆ నిబంధనలను ఎవరూ పాటించడంలేదు. 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నా, వీటిపై స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విస్మయం కలిగిస్తోందని పలువురు అంటున్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో నడుస్తున్న సరిగమ రెస్టారెంట్ అండ్ బార్

నాలుగో పట్టణ పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న సాయికృష్ణ బార్

ఆగడాలను అరికట్టాలి

డైమండ్ పార్క్‌కు రోజూ వాకింగ్‌కు వస్తుంటాను. నాలానే చాలామంది వాకర్స్ ఉంటారు. సమీపంలోని బార్‌లో మద్యం తాగి మందుబాబులు రోడ్డుపైకి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. పోలీసులు చొరవ చూపి మందుబాబులు ఆగడాలను అరికట్టాలి.

కృష్ణవేణి,
వాకర్

24 గంటల విక్రయాలు సరికాదు

దపదపాలుగా మద్యాన్ని నియంత్రిస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ 24 గంటలూ విక్రయాలు జరుగుతున్నాయి. తెల్లవారుజామున 6 గంటలకే మద్యం షాపులు తెరుస్తుండటంతో మందుబాబులు తాగి రోడ్డుపైకి వచ్చి మితిమీరి ప్రవర్తిస్తున్నారు. బార్లలో సమయపాలన పాటించేలా అధికారులు చొరవచూపాలి.

సత్యనారాయణ
వాకర్

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందార. ఘటనలకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం...భీమిలి మండలం అమనాం గ్రామానికి చెందిన చిల్లా వెంకటలక్ష్మి (48) అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం ఆటోలో కెజిహెచ్‌కు వెళు న్నారు. పెద్దిపాలెం బ్రిడ్జి పైన వెనుక నుంచి వస్తున్న కారు అదుపుతప్పి ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలైంది. చికిత్స నిమిత్తం స్థానిక ఎన్నారై ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తల్లి చిల్లా భవాని ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్యాంసుందర్ దర్యాప్తు చేస్తున్నారు

పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామానికి చెందిన పెద్దింటి శివప్రసాద్ (20), పాంచ్రంకి కార్తీక్ (21) ద్విచక్రవాహనంపై ఆనందపురం వైపు వస్తుండగా సోమవారం అర్ధరాత్రి పెద్దిపాలెం బ్రిడ్జిపై అదుపుతప్పి డివైడర్ ఢీకొట్టారు. వాహనం వెనుక కూర్చున్న శివప్రసాద్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో గుర్తు తెలియని వాహనం శివప్రసాద్ మీదుగా వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మతిచెందాడు. కార్తీక్ తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసును ఎస్ఐ నరసింహమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

క్వారీ ఏర్పాటుపై గ్రామ సభ

ప్రజాశక్తి-పద్మనాభం : క్వారీ ఏర్పాటుపై మండలంలోని రెడ్డిపల్లి గ్రామ సచివాలయ ప్రాంగణంలో అధికారులు మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలుష్య నియంత్రణ ఇఇ శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్, ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి హాజరై ప్రజాప్రాయసేకరణ చేశారు. సభకు హాజరైన వారు సమ్మతించడంతో అధికారులు సభను ముగించారు.

మొక్కుబడిగా ప్రజాభిప్రాయ సేకరణ

క్వారీ ఏర్పాటుపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు స్థానికులకు ఎటువంటి సమాచారమూ ఇవ్వలేదని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కసిరెడ్డి దామోదరరావు, శేరీఖాండం సర్పంచ్ పల్లాంటి చిన్నారావు ఆరోపించారు. క్వారీకి అనుమతి ఇచ్చిన ప్రదేశం రెడ్డిపల్లి రెవెన్యూ అయినప్పటికీ ఆ ప్రదేశంలో శేరీఖాండం గ్రామానికి చెందిన 50 శాతం రైతులకు చెందిన భూమి ఉందని వారు తెలిపారు. భూమి ఉన్న రైతులకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన భూమి కూడా లేని వారిని పిలిచి సమావేశం ముగించారని మాజీ సర్పంచ్ కుమార్, నమ్మి వెంకటరావు, వాడపల్లి శ్రీనివాసరావు, టి.అప్పలరాజు, వి.వెంకటరావు ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాలు ఏర్పాటుచేసినప్పుడు క్వారీకి సమీపంలో ఉన్న రైతులకు సమాచారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. గ్రామసభలో డిప్యూటీ తహశీల్దార్ కిశోర్, సచివాలయ కార్యదర్శి రవి, ఉప సర్పంచ్ శిరుగుడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి -కంచరపాలెం : జివిఎంసి 57వ వార్డు పరిధి సాకేతపురం కొబ్బరితోట ప్రాంతంలో సుమారు రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వార్డు అభివృద్ధి, ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. వార్డులో ఇటీవల చేపట్టి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు రోడ్లు, కాలువల నిర్మాణం, గెడ్డలలో పూడికతీత పనులు, దోమల నివారణ తదితర అనేక పనులు చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఇంజినీర్ ఏడుకొండలు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తారా ప్రసన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ గణేష్, స్థానికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముర్రువాణి నానాజీ

ఘనంగా ఎల్లమ్మ జాతర

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని పొడుగుపాలెం గ్రామంలో రెండు రోజులుపాటు ఎల్లమ్మ తల్లి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామాల ప్రజలు వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐలు నరసింహమూర్తి, శ్యాంసుందర్ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, నాయకులు సూరిబాబు, చందక అప్పలస్వామి, షినగం రామారావు, బంటుపల్లి మణిశంకర్‌నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయంలో మంగళవారం ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ పంచాయతీ సర్పంచ్ ఎల్.రామారావు మృతితో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడిందని ఎండిఒ పి.వెంకట రమణ తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీలో 1109 మంది పురుషులు, 1109 మంది మహిళా ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. టి.నగరపాలెం పంచాయతీ 10వ వార్డు స్థానానికి సంబంధించి ఓటర్ల జాబితాను గ్రామ సచివాలయంలో ప్రదర్శించారు. ఇక్కడ వార్డు సభ్యుడు రాజీనామాతో ఖాళీ ఏర్పడినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తున్న సచివాలయ ఉద్యోగి

రెండు గ్రామాల్లో రీ సర్వే పూర్తి

మరో రెండింటిలో తుది దశకు
ఇంకో పది గ్రామాల్లో డ్రోన్ ఫ్లై

ప్రజాశక్తి- భీమునిపట్నం : శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద మండలంలోని ఆర్‌వై అగ్రహారం, నిడిగట్టు గ్రామాల్లో 2021 జనవరిలో తొలి దశలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి డ్రోన్ల ద్వారా సమగ్రంగా భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభించారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత ఈ తరహా భూ సర్వే ప్రక్రియ ప్రారంభించారు. ఆర్‌వై అగ్రహారంలో 185 మంది రైతులకు చెందిన 250 ఎకరాల్లోను, నిడిగట్టులో 742 మంది రైతులకు చెందిన 700 ఎకరాల్లోనూ రీ సర్వే పూర్తి చేశారు. సంబంధిత రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తూ లాండ్ పార్సిల్ మ్యాప్‌లు ఇప్పటికే అందజేశారు. ప్రతి భూ కమతానికి ఆధార్ నంబర్ తరహాలో ఒక విశిష్ట సంఖ్య (ఐడి నంబర్), క్యూ ఆర్ కోడ్ కేటాయించారు. పట్టాదారు పాస్ పుస్తకంలో పొందు పరిచే ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ భూమికి సంబంధించి అన్ని వివరాలు లభ్యమవుతాయి.

నిడిగట్టులో భూ సర్వే (ఫైల్ ఫొటో)

మరో రెండు గ్రామాల్లో తుది దశకు చేరిన సర్వే

బోడమెట్టపాలెం, టి.నగరపాలెం గ్రామాల్లో 2022 డిసెంబర్‌లో రెండో దశలో భూ సర్వే ప్రక్రియ ప్రారంభించారు. బోడమెట్టపాలెంలో 653.25 ఎకరాలు, టి.నగరపాలెంలో 406 ఎకరాల్లోచేపట్టిన సమగ్ర భూ సర్వే తుది దశకు చేరింది.

మరో పది గ్రామాల్లో డ్రోన్ ఫ్లై

అమనాం, అన్నవరం, చిప్పాడ, దాకమర్రి, తాళ్ళవలస, తాటితూరు, మజ్జివలస, నారాయణరాజుపేట, సింగనబంద, మూలకుద్దు గ్రామాల్లో డ్రోన్ ఎగురవేశారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : రోటరీ క్లబ్ ఆధ్వర్యాన హెచ్‌బి.కాలనీ సిడబ్ల్యూసిలో 71 మంది మహిళలకు మంగళవారం కుట్టు మిషన్లను పంపిణీచేశారు. 71 మందికి ముందుగా ఉచితంగా కుట్టు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జన శిక్షణ సంస్థ ప్రతినిధులు రామరాజు, పుల్ల నాయుడు, ధనలక్ష్మి, రోటరీ క్లబ్ ప్రతినిధులు దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్, కెవై.దాసు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సంస్కృతి గ్లోబల్ స్కూల్లో ప్రదర్శనల గురించి వివరిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రాజెక్టులు, నమూనాలను ప్రదర్శించారు. సర్ సివి రామన్‌ను ఆదర్శంగా తీసుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని పలువురు వక్తలు సూచించారు.

పిఎం.పాలెం : చంద్రంపాలెం పాఠశాలలో విద్యార్థులు తయారుచేసిన 147 రకాల ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచారు. అనంతరం సైన్స్‌కు సంబంధించిన వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వివిధ రకాల నమూనాలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సందీప్, ఉపాధ్యాయులు, అతిథులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక పిఎన్ఎం జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం తిరుమల శ్రీదేవి ఆధ్వర్యాన సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ప్రభుత్వ డైట్ ప్రిన్సిపల్ యు.మాణిక్యంనాయుడు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ప్రారంభించారు. బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సైన్స్‌డేలో ఎంఇఒ కెవి.బాలామణి, హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు. సన్ స్కూల్‌లో 230కి పైగా నమూనాలు ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ కె.శ్రీనివాస్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

ఆరిలోవ : సర్ సివి.రామన్ జన్మదినాన్ని పురష్కరించుకొని ఆరిలోవ తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక దినోత్సవాన్ని ఏర్పాటుచేశారు. నడుపూరు, మల్కాపురం, కణితి, పెందుర్తి, అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారుచేసిన 25 ప్రాజెక్టులను, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 82 వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఎపిసి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను డిఇఒ ఎల్.చంద్రకళ, ఎపిసి శ్రీనివాసరావు పరిశీలించారు. తోటగరువు విద్యార్థులు ప్రదర్శించిన టెస్లా కాయిల్ ప్రాజెక్టు అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తోటగరువు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జికెడి భవాని, సైన్స్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సైన్స్ దినోత్సం నిర్వహించారు. సర్ సివి.రామన్ చిత్రపటానికి ఎయు సైన్స్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, ఉదయభాస్కర్, వివిధ విభాగాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధురవాడ : గీతం డీమ్స్ విశ్వవిద్యాలయంలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గీతంలో రూ.45 కోట్లతో అభివృద్ధి చేసిన 'మూర్తి' కేంద్రీయ పరిశోధనశాలను బాబా అణుశక్తి పరిశోధన కేంద్రం అనుబంధ హెూమీబాబా చైర్ ప్రొఫెసర్, ప్రముఖ అణుశాస్త్రవేత్త డాక్టర్ ఆర్.చిదంబరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ భద్రత, జాతీయ అభివృద్ధి ఒకే నాణేనికి రెండు వైపుల ఉన్న ప్రాధాన్యత అంశాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ జితేంద్ర శర్మ, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపి మెడ్‌టెక్‌జోన్‌తో గీతం డీమ్ విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసింది.

కరాస: నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజికల్ లేబొరేటరీ (ఎన్ఎస్‌టిఎల్)లో జాతీయ సైన్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.శేషుబాయ్, ఆర్.రవి, శాస్త్రవేత్తలు పివిఆర్.గణేష్‌కుమార్, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం గొట్టిపల్లిలోని న్యూ లైఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు 60 రకాల నమూనాలు ప్రదర్శించారు. ఇందులో నీటిపై తేలియాడే ఇల్లు నిర్మాణం, ద్విచక్ర వాహన ప్రమాదాల నివారణ, రిఫ్రిజిరేటర్‌లో నీటి నిలువలు నివారణ, ఎలక్ట్రికల్ హీటర్ ప్రమాదాల నివారణ అంశాలపై విద్యార్థులు ప్రదర్శనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయశ్యామ్, సైన్స్ ఉపాధ్యాయులు శైలజ, నియోబి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 51వ వార్డు పరిధిలోని శ్రీముఖ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు రూపొందించిన పలు నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. నగరంలో పెరుగుతున్న కాలుష్యం, ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన అంశాలను సంబంధించిన నమూనాలు ఆసక్తి పెంచాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎమ్‌డి.దసాగిరి, ఉపాధ్యాయులు అరుణకుమారి పర్యవేక్షించారు.

నక్కపల్లి : జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం రాణీలలిత ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన హైడ్రాలిక్ క్రేన్ నమూనా, దర్పణాలతో పూలతోట, రెయిన్ అలారం, ఊపిరితిత్తుల పనిచేయువిధానం, తదితర నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు. ఎన్.అప్పారావు, ఎన్.వి.ఎస్.ఆచార్యులు, టి.వి.రమణ, సుందరరావు, విశ్వనాథ్, ఎస్.వి.లక్ష్మి, సుమబిందు, అనంతలక్ష్మి, సత్యవతి కె.సత్తిబాబు. అరుణ పాల్గొన్నారు.

వేంపాడులో..

వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఎయిర్ కూలర్, వాటర్ అలారం, ఫైర్ అలారం, జీవ వైవిధ్యం, జలచక్రం, నీటివినియోగం, డ్రిప్ ఇరిగేషన్, కత్రిమ రోబో మొదలగు పర్యావరణ స్పృహతో కూడిన ప్రాజెక్టులు ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎమ్. మూర్తిరాజు, డి.రాజు, సిహెచ్.స్వర్ణ, యు. మణికుమార్ పాల్గొన్నారు .

చీడికాడ : మండల కేంద్రంలోని అక్షరశ్రీ విద్యానికేతన్‌లో జాతీయ సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు

కోటవురట్ల : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాజపేట పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంఇఒ అప్పారావు తిలకించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించి తగువిధంగా ప్రోత్సహించాలని సూచించారు.

మాడుగుల : విద్యార్థులకు పరిశోధన స్ఫూర్తి ఎంతో అవసరమని మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రి అన్నారు. మంగళవారం మాడుగులలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సర్ సివి.రామన్ పరిశోధనలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకుని, ఆయనను స్ఫూర్తిగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, ఇతర అధ్యాపకులు షర్మిల, రమణమూర్తి ,సులోచన, పైడిరాజు, రాజు, నారాయణ, రామ్ కుమార్, శిరీష, నాగేశ్వరరావు పాల్గొన్నారు

పాయకరావుపేట : సైన్సు ప్రాజెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని చైతన్య టెక్నో సంస్థ ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు అన్నారు జాతీయ సైన్స్‌డే సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్పోను చైతన్య టెక్నో పాఠశాల సంస్థ ఎజిఎం ఎం.సురేష్, ఎంఇఒ కె.గాంధీ ప్రారంభించారు. ఏకో సిస్టం, వాయు కాలుష్యం, మానవ శరీరాలు శరీర భాగాలు, స్మార్ట్ సిటీ డయాలసిర్, సాయిల్ కన్సర్వేషన్, లిఫ్టు రోబో వంటి ప్రాజెక్టు నమూనాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాణిక్యాలరావు ఆర్ఐ గోపీనాథ్, ఎఒ విజయ్, ప్రైమరీ ఇన్‌ఛార్జి రమ్య, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి గౌరి, శివాజీ గణేష్,సువర్ణరాజు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : సైన్స్ డే సందర్భంగా ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం మద్దిలపాలెంలోగల శివశంకర్ విద్యానికేతన్, శివాజీపాలెంలోగల అనుభవ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు స్వీయ ఆలోచనా ప్రతిభతో రూపొందించిన సైన్స్, గణిత ఆవిష్కరణలను తిలకించారు. ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు, 23వ వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, ప్రిన్సిపల్ సుధ, శ్రీకాంత్, గోవింద్ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక ఏఎంఎఎల్ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన పరిశోధన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జయబాబు, కళాశాల చైర్మన్ దాడి శ్రీనివాసరావు, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ నిరంజన్ కుమార్, కళాశాల సూపరింటెండెంట్ అనురాధ పాల్గొన్నారు. ఫిజిక్స్ విభాగం హెడ్ డాక్టర్ నిరంజన్ కుమార్‌ను సత్కరించారు. స్థానిక గవరపాలెం హిమ శేఖర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థుల రూపొందించిన పీరియాడిక్ టేబుల్, పర్యావరణ పరిరక్షణ, మొబైల్ ఎరిక్షన్ ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ జనార్ధన్, సైన్సు రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కే రామ్మోహన్రావు, ప్రిన్సిపల్ పి సురేష్ చౌదరి పాల్గొన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నరసింహం డాక్టర్ సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్ ఎడ్మిన్ డాక్టర్ కెఎస్ ఈశ్వరరావు, డాక్టర్ సిహెచ్ ప్రభాకర్ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి హెచ్ఎం సిహెచ్.చిన్నమ్మాయి ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞాన నమూనాలను ఎంఇఒ ప్రారంభించారు. ఉపాధ్యాయులు కె.గురునాథరావు, బిఎస్.రోజా, ఎన్.శ్రీనివాసరావు, పివి.భాస్కరరావు, రాధాకుమారి, రాంప్రసాద్, కుమార్ ప్రకాష్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకొని మంగళవారం స్థానిక అయ్యన్న పాఠశాలలో సర్ సివి.రామన్ చిత్ర పటానికి ఆ విద్యాసంస్థల అధినేత డాక్టరు ఖాసీం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పూల మాలలు వేశారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించి విద్యార్థులను అభినందించారు. సైన్సు ఉపాధ్యాయులు హరీషా, సతీష్, సీముసురు రమణ, కెఎస్ఎస్‌వి.ప్రసాద్, ఎం.కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్ళపాలెం శ్రీగాయత్రీ హైస్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రతినిధులు ఐయినాల అప్పారావు, బి కుమార్, ప్రిన్సిపాల్ నగేష్, ధనుంజయ రావు పాల్గొన్నారు. కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్‌లో విద్యార్థులు రోబో రాకెట్, చెత్త సంపద, ఇతర నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. స్కూల్ డైరెక్టర్ బత్తుల నోబెల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ మహేష్ పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం శాఖా గ్రంథాలయంలో సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జి తిరుమల కుమారి, పలువురు విద్యార్థులతో పాటు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని కందిపూడి యూపి స్కూలులో గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్ బీయింగ్ కాన్సెప్ట్‌తో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ మోడల్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఎంఇఒ చంద్రశేఖర్, సర్పంచ్ కొప్పాక గణేష్ , పాఠశాల కమిటీ చైర్మన్ భవానీసురేష్, ప్రధానోపాధ్యాయులు బలరాం, సైన్స్ ఉపాధ్యాయురాలు ప్రభావతి పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శను ఎంఇఒ సిహెచ్ రవీంద్రబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ మోడల్స్‌ను తిలకించి వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఎం నాగమణి, పూర్ణిమ, ఆదిరెడ్డి ఈశ్వరరావు, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

అచ్యుతాపురం : స్థానిక కైట్స్ విద్యా విహార్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బార్క్ సైంటిస్ట్ సూర్యనారాయణ, సిఐ వై మురళి రావు, వశిష్ట ఫార్మా కంపెనీ మేనేజర్ వీరభద్రరావు, కైట్స్ విద్యా విహార్ స్కూల్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, వైసిపి నాయకులు కోన బుజ్జి, కె.విమల నాయుడు, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ప్రసాద్, డ్రీమ్స్ నాయుడు, డాక్టర్ వెంకట్, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

పరవాడ : మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో వైజ్ఞానిక, ప్రయోగ పద్ధతిలో పిల్లలు నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులకు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి వాటిని పరిశీలించారు. సీఈఓ కె.నిశంత్, సైన్స్ ఉపాధ్యాయులు ఆనంద్, శంకర్, భార్గవి, రూపాలి, వెంకట్ రమణ, మధుమిత తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణశ్రీనివాస్

పిఎన్ఎం జివిఎంసి హైస్కూల్‌లో పదర్శనను తిలకిస్తున్న జెడ్సీ రాము

కంచరపాలెం పరిధి శ్రీముఖ పాఠశాలలో...

గొట్టిపల్లిలోని 'న్యూలైఫ్' పాఠశాలలో

పాయకరావుపేట చైతన్య పాఠశాలలో....

ఉత్సాహభరితంగా గుర్రం పందేలు

పరుగు పందెంలో పాల్గొన్న గుర్రం

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గ్రామ దేవత శ్రీ పరదేశిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ప్రముఖ పారిశ్రామిక వేత్త, వైసిపి నేత బోకం శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో సర్పంచ్ బోకం స్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం పందేలను వైసిపి రాష్ట్ర కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో గుర్రం పందాలు నిర్వహించి గ్రామీణ వాసులకు ఉల్లాసాన్ని అందించడం ఆనందదాయకమన్నారు. ఈ గుర్రం పందాల్లో 26 గుర్రాలు పాల్గొనగా పది బహుమతులను నిర్వాహకులు ప్రకటించారు. అందులో దేవరాపల్లికి చెందిన నవీన్ స్వేరీ ప్రథమ బహుమతి పొందగా, రామన్నపాలెంకు చెందిన చోడిమాంబిక విక్రమ్ ద్వితీయ, రాగూర్ తృతీయ స్థానాలు పొందాయి. కొట్యాడ తలారికి చెందిన సింగపూర్ సత్యనారాయణకు నాల్గవ బహుమతి, తవ్వవాని పాలెంకు చెందిన శ్రీనివాస్ యూత్‌కు ఐదవ బహుమతి, కొట్యాడ తలారికి చెందిన జ్వాలకు ఆరో బహుమతి, రాయపురాజుపేట కు చెందిన డాడి నూక హనుమంతప్పారావుకు ఏడో బహుమతి, కొట్యాడ తలారికి చెందిన షేక్‌కు ఎనిమిదో బహుమతి, భీమిలికి చెందినషీరా కార్తిక్‌కు తొమ్మిదో బహుమతి, హాశికకు పదో బహుమతి లభించాయి. అనంతరం గుర్రం పందాల్లో గెలుపొందిన విజేతలకు చొక్కాకుల వెంకటరావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలని మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గ్రామదేవత శ్రీపరదేశిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా వైసిపి నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత బోకం శ్రీనివాసరావు ఆర్థిక సహాయంతో గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను ముత్యాల నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడలు దేహ దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ఈ పోటీలలో గెలుపొంది విజేతలకు ప్రథమ బహుమతి రూ.12 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8వేలు, నాలుగో బహుమతి రూ.6 వేలు చొప్పున అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత బోకం శ్రీనివాసరావు, సర్పంచ్ బోకం స్వామినాయుడు, వైస్ ఎంపిపి-2 చొక్కాకుల గోవింద, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా కమిటీ డైరెక్టర్ బోకం కాసుబాబు, సచివాలయం కన్వీనర్ బోకం నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ వనం దేముడుబాబు, సచివాలయ కన్వీనర్ బోకం నాగేశ్వరరావు, వార్డ్ మెంబర్లు, శ్రీనివాస్ యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి ముత్యాలనాయుడు

భోజనాలు వడ్డిస్తున్న టిడిపి నాయకులు

అన్న మొబైల్ క్యాంటీన్‌కు జన తాకిడి

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

టిడిపి యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యాన యలమంచిలి పట్టణ టిడిపి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్న మొబైల్ క్యాంటీన్‌కు మంచి రోజు రోజుకు జనాదరణ పెరుగుతోందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు గొర్లి శివన్నారాయణ తెలిపారు. అన్న మొబైల్ క్యాంటీన్ ప్రారంభించి 30 రోజుల పూర్తయిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 250 నుంచి 300 మంది పేదలకు అన్న క్యాంటీన్ ద్వారా భోజనం పెడుతున్నామని చెప్పారు. రోజు కూలి పని చేసుకోవడానికి వచ్చే పేద మధ్యతరగతి కార్మికులు హోటల్‌కు వెళ్లి భోజనం చేయాలంటే రూ.60 నుంచి రూ.80 ఖర్చు చేయాల్సి వస్తుందని, అన్న క్యాంటీన్‌లో రూ.5కే కడుపునిండా రుచికరమైన భోజనం పెడుతున్నట్లు చెప్పారు. తద్వారా మిగిలిన డబ్బులు కుటుంబ పోషణకు ఉపయోగపడుతుందని కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ అన్న మొబైల్ క్యాంటీన్ నిర్వహణకు ఎన్నారై కో-ఆర్డినేటర్ జయరాం కోమటికి పేదలందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ సెక్రటరీ ఆడారి రమణబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బొద్దపు రమణ, పెయ్యల రామకృష్ణ మండలంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

121వ రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఒబి ప్రధాన గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 121 రోజుకు చేరింది. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. 121 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంపై నిర్వాసితులు మండిపడ్డారు. ఇప్పటికైనా జెట్టీ నిర్మాణం చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

2.51 లక్షల మందికి పిఎం కిసాన్ ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

ప్రజాశక్తి-అనకాపల్లి

రైతు భరోసా, పిఎం కిసాన్ మూడో విడత ఆర్థిక సహాయాన్ని మంగళవారం మండలంలోని తగరంపూడి గ్రామం రైతు భరోసా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో రెండు లక్షల 51 వేల 48 మంది రైతులకు 54 లక్షల 15 వేల రూపాయలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మొత్తం రైతుల ఖాతాల్లోకి నేరుగా జమవుతాయన్నారు. దీంతో ఇంతవరకు అనకాపల్లి జిల్లా రైతులకు ఒక వెయ్యి 267 కోట్ల 93 లక్షల రూపాయలను రైతు భరోసా, పీఎం కిసాన్ పరిహారాన్ని అందజేయడం జరిగిందని చెప్పారు. మాండస్ తుఫాన్‌లో నష్టపోయిన 499 మంది రైతులకు 16 లక్షల 12 వేల రూపాయల పరిహారం సొమ్మును కూడా రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన నిమిత్తం వివిధ వ్యవసాయ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా పిఎం ఎస్‌డిఎస్ కింద విత్తన బంతుల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా అభ్యుదయ రైతులు, గ్రామస్థాయి వ్యవసాయ సిబ్బంది, కౌలుదారులు, దేవాదాయ, ఆర్ఓఎఫ్ఆర్ రైతులు, ఎఫ్‌పిఓ రైతులు, ఏపీసీఎన్ ఎఫ్ రైతులు పాల్గొన్నారు.

సప్నా ఆప్కా లోన్ హమారా క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

భారత ఆర్థిక వ్యవస్థను నడపడంలో చిన్న పారిశ్రామికవేత్తల శక్తి, సామర్థ్యాలను తాము విశ్వసిస్తున్నట్లు ఐఐఎఫ్ఎల్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మానవ్ వర్మ తెలిపారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ చిన్న పారిశ్రామికవేత్తలకు సరైన సమయంలో క్రెడిట్ అందాలన్నారు. దానిని అందించడంలో వారికి తాము సహకరిస్తున్నట్లు తెలిపారు. నాలుగు వేల శాఖలు, బహుళ ప్లాట్‌ఫారాల ద్వారా భారతదేశం అంతటా ఉన్న తమ కంపెనీ గోల్డ్ లోన్, హోమ్ లోన్, బిజినెస్ లోన్, మైక్రో ఫైనాన్స్ విభాగాలలో మెరుగైన స్థితిలో ఉందన్నారు. తమ కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ బాలీవుడ్ నటి తమన్నా భాటియా వ్యవహరించేందుకు అంగీకరిస్తూ సంతకం చేశారన్నారు. భారతదేశంలోని 35 కోట్ల వినియోగదారులకు చేరుకోవడమే తమ లక్ష్యమన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - కశింకోట

రహదారి భద్రతపై అవగాహన కల్పించడానికి మండలం సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం కశింకోట బాలికల హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు స్వర్ణ కుమారి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణం ప్రమాదకరమని తెలిపారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలన్నారు. స్కూల్ చైర్మన్ వై.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు డి. కమల, ఏపిఎం ఎస్ శ్రీనివాసరావు, సీసీ సత్యనారాయణ, బాలికల పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

జీడిమామిడి యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి

జీడిమామిడి తోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చుని హార్టికల్చర్ కొచ్చి కన్సల్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి అప్పారావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికే జగన్నాథరావు, జిల్లా ఉద్యానవన అధికారి జి ప్రభాకర్ తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో జీడి మామిడి యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, అభివృద్ధి, వద్దావ్య జీడి మామిడి తోటల నిర్వహణ వంటి అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. జీడిపప్పు ఉత్పత్తిలో పురోగతి సాంకేతికత, ప్రభుత్వం రాయితీలపై ఇచ్చే యంత్ర పరికరాల వివరాలను తెలియజేశారు. అనంతరం క్షేత్ర సందర్శన చేశారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ క్యాజునట్ అండ్ కోకో డెవలప్మెంట్ కొచ్చి సైంటిస్ట్, హెడ్ డాక్టర్ ఉమామహేశ్వరరావు, డిఆర్ఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ సైంటిస్ట్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, ఎం రామారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు దివ్య సుధ, హార్టికల్చర్ అధికారి ఏ లావణ్య, శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ అప్పారావు

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి- కె.కోటపాడు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి సిబ్బంది మంగళవారం ఒక ప్రకటన తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరానికి వచ్చే కంటి వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా వారి యొక్క ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఫోన్ నెంబర్ తీసుకురావాలని సూచించారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరిస్థితిని పరీక్షించి మందులు ఇస్తామని, కంటి ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయబడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలు సద్విని చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ వైర్లకు అంటుకునే చెట్ల కొమ్మలు తొలగింపు, తుప్పు పట్టిన దెబ్బతిన్న స్తంభాల మార్పు నేపథ్యంలో పట్టణంలో పలుచోట్ల బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డిఈ ఎస్.రమణమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పూడి మడక రోడ్డు, నెహ్రూ చౌక్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, ఉమ్మలాడ జంక్షన్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

2న అచ్యుతాపురం మండల సమావేశం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మండలాధ్యక్షురాలు కోన సంధ్య బుజ్జి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

తంతడిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- అచ్యుతాపురం

మండలంలోని తంతడి గ్రామంలోని వైయస్సార్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అలేఖ్య రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిహెచ్ మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రారు కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి -అనకాపల్లి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కొణతాల హరినాథ్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారికి, పరిసర ప్రాంతాల వారికి అందుబాటులో ఉందని తెలిపారు. అయితే ఈ కార్యాలయాన్ని కొత్తూరు జాతీయ రహదారిలో ఒక భవనంలోకి మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి, వికలాంగులు, మహిళలు, రైతులు ఇక్కడ సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. కార్యాలయాన్ని మార్చాల్సి వస్తే పట్టణంలోనే అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు సిహెచ్ శ్రీనివాసరావు, జి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాయింట్ కల్పనాకుమారికి వినతిపత్రం ఇస్తున్న ఆప్ నేతలు

ఘనంగా టైలర్స్ డే

ప్రజాశక్తి -యంత్రాంగం

విశాఖ జిల్లాలో పలుచోట్ల మంగళవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు.

తగరపువలసలో ర్యాలీ చేస్తున్న టైలర్లు

తగరపువలస : స్థానిక శ్రీ ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన చిట్టివలస పుట్ బాల్ గ్రౌండ్‌లో ముందుగా కుట్టు మిషన్ రూపకర్త విలియన్స్ హో చిత్రపటానికి టైలర్లు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. స్థానికంగా వై జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. జ్యూట్ మిల్లు కల్యాణ మండపంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు హాజరై మాట్లాడుతూ, టైలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చేదోడు పథకం అర్హులందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. ఎల్లమాంబ టైలర్ల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రయత్నం చేస్తామని చెప్పారు. సంఘం అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎపి పద్మ శాలి కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, ఒకటో వార్డు వైసిపి అధ్యక్షులు జగుపల్లి ప్రసాదరావు, వైసిపి నాయకులు చినబాబు, పందిరి విజయ్, సంఘం ప్రధాన కార్యదర్శి పెంటపల్లి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు చింతల సురేష్, కోశాధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : చినముషిడివాడలో టైలర్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బహుజన దర్జీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు షేక్ మౌలా, సంఘం గౌరవాధ్యక్షుడు షేక్ బ్రహన్ మాట్లాడుతూ, రడీమేడ్ దుస్తుల తయారీ రంగంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వచ్చిన నుంచ టైలర్ల జీవనం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తీడా రామకృష్ణ, సంఘం నాయకులు గుండప్పు రమణ, పసగాడా సోమరాజు, మహేష్, చిన్నారావు, సన్యాసిరావు, మాడెం అప్పారావు, గని తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన అక్కయ్యపాలెం కూడలిలో ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐజాక్ మెరిట్ సింగర్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సిహెచ్.యాదిగిరిరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి సిహెచ్ వేణు, కోశాధికారి సిహెచ్ తిరుపతిరావు, సభ్యులు బి.ఇషాక్, బాబా పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : రెడీమెడ్ రంగం విస్తరించడంతో టైలరింగ్‌కు గిరాకీ తగ్గి తమ పరిస్థితి దయనీయంగా మారిందని దర్జీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం కూడలిలో ప్రపంచ టైలర్ల డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైలరింగ్ మెషిన్ సృష్టికర్త ఐజాక్ మెరిట్ సింగర్‌కు నివాళ్లర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గ్రేటర్ విశాఖ టైలర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సిహెచ్.యాదిగిరి రెడ్డి మాట్లాడుతూ 23 ఏళ్లుగా దర్జీల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తాము ఎన్నిసార్లు అధికారులకు, ప్రభుత్వానికి సామజిక భవనం కోసం విన్నవించుకున్నా కనీస స్పందన లేదన్నారు. సంయుక్త కార్యదర్శి కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ తమ సొసైటీలో 150 షాపులకు చెందిన వెయ్యి మంది సభ్యులుగా ఉన్నారన్నారు. ఇతర రంగాలకు ప్రభుత్వం చేస్తున్న రుణ పథకాలను తమకు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సిహెచ్.వేణు, కోశాధికారి సిహెచ్.తిరుపతిరావు, సభ్యులు బి.ఇషాక్, బాబా పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : ప్రతి టైలర్‌కు ప్రభుత్వం రూ.10,000 ఇచ్చి ఆదుకోవాలని టైలర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కోరుకొండ, సూర్యనారాయణ, నాయుడు మల్లికార్జునరావు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంలో టైలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, షాపులు ఉన్న టైలర్స్ యజమానులకు మాత్రమే ప్రభుత్వం రూ.10వేలు ఇస్తుందని, ఇదే షాపులలో కష్టించి పనిచేస్తున్న టైలర్లకు ఈ పథకం వర్తించకపోవడం విచారకరమని పేర్కొన్నారు. షాపులకు అద్దెలు చెల్లించుకోలేక తమ సొంత ఇంటిలోనే దర్జీ వృత్తి చేసుకుంటున్న వారికి కూడా ఈ పథకాలు వర్తించడం లేదని వాపోయారు. ప్రభుత్వం పునరాలోచించి దర్జీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు.

ఎర్ర కుళ్ళు తెగులును తట్టుకునే చెరుకుగా

ఆర్ఎఆర్ఎస్ రూపొందించిన సిఒఎ16321కు గుర్తింపు

సర్టిఫికెట్ చూపిస్తున్న డాక్టర్ జగన్నాథరావు, ఇతర శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జన్యు శాస్త్ర విభాగం రూపొందించిన సిఓఏ 16321 (2010 ఏ 229) చెరకు రకానికి ఎర్ర కుళ్ళు తెగులును సమర్థవంతంగా ఎదుర్కొనేదిగా న్యూఢిల్లీ నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్ ధ్రువీకరించింది. ఈ మేరకు పరిశోధన స్థానం పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికే జగన్నాథరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ చెరుకు పంటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారిగా జన్యు శాస్త్రంలో స్థానం దక్కించుకుందని తెలిపారు. ఈ వంగడాన్ని రూపొందించడంలో ఆర్ఏఆర్ఎస్ జన్యు విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ ఎం చారుమతి, శాస్త్రవేత్త డాక్టర్ పివి పద్మావతి, తెగుళ్ళ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ విశ్వనాథన్, శాస్త్రవేత్త డాక్టర్ పి కిషోర్ వర్మ, సేద్య విభాగం ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ చిత్కలాదేవి, డాక్టర్ ఎం భరత లక్ష్మిని ఆయన అభినందించారు.

అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు కేరళ రాష్ట్రం కాశార గోడ్‌లో పంటకోత అనంతర సాంకేతిక పరిజ్ఞానంపై జరిగిన వర్క్ షాప్‌లో తనతో పాటు శాస్త్రవేత్త డాక్టర్ పి శ్రీదేవి హాజరైనట్లు చెప్పారు. రానున్న ఏడాదికి కార్యాచరణలో భాగంగా అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు మూడు ప్రాజెక్టులు అప్పగించడం జరిగిందన్నారు. బెల్లం తయారీలో ఆరోగ్యానికి హానికరమయ్యే సల్ఫర్ డయాక్సైడ్ ను కొలిచే సాధనం తయారీ, బెల్లం గానుగ ఆడే సమయంలో ఇంధనం, విద్యుత్ ఆదా కోసం సౌర శక్తిని వినియోగించడం, పొయ్యి వేడి చేసేందుకు కట్టెలు ఆధారిత గ్యాస్‌ను వినియోగించడం, బెల్లం వండేటప్పుడు పైకి తేలే తెట్టును మోటార్ ద్వారా తొలగించే పరికరాలను రూపొందించడం జరుగుతుందని చెప్పారు.

ఎయు విసిపై విచారణ నివేదికను బహిర్గతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి పివిజిడి ప్రసాద్ రెడ్డి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఎన్నికల కమిషన్‌కు అందిన ఫిర్యాదులపై జిల్లా అధికార యంత్రాంగం జరిపిన విచారణ నివేదికను కలెక్టర్ మల్లికార్జున బహిర్గతం చేయాలని పబ్లిక్ ఫోరం రాష్ట్ర కోఆర్డినేటర్ కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆర్టిఏ చట్టం సెక్షన్ 4(1)(సి) అనుసరించి ప్రజలపై ప్రభావం చూపే నిర్ణయాలు ప్రకటించినప్పుడు వాటికి సంబంధించిన అన్ని వాస్తవాలను బయట పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థికి మద్దతుగా విశాఖలో ఓ ప్రైవేట్ హొటల్లో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో విసి ప్రసాద్ రెడ్డి సమావేశం నిర్వహించారని తెలిపారు. దీనిపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో జరిగిన విచారణ నివేదికను గోప్యంగా ఉంచడం సిగ్గుచేటన్నారు. ఈ మేరకు ఈమెయిల్ ద్వారా కలెక్టర్కు వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో మార్చి 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు అనకాపల్లి జిల్లా జట్టు ఎంపికైనట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. స్థానిక ట్రిబుల్ ఎస్ జిమ్ అధ్యక్ష, కోశాధికారులు నీల, అజయ్ పర్యవేక్షణలో ఈ ఎంపిక జరిగిందన్నారు. ఎంపికైన వారిలో జె.లవ కుమార్, సిహెచ్ లోకేష్, కెవివిఎస్ ప్రసాద్, ఏ సతీష్, ధరనేష్, కే నరేంద్ర ఎం శ్రీను, వి నానాజీ, అందే గణేష్, పి కుశ్వంత్, దీపక్, మహిళ విభాగంలో దొండ కుసుమ బద్రీనాథ్ ఉన్నట్లు తెలిపారు.

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఆల్ ఇండియా ఐక్య క్రైస్తవ జెఎసి చైర్మన్ టి.బాబూరావు కోరారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు చేయడమే కాకుండా చర్చిలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. చర్చిలకు, క్రైస్తవులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. నేరాలకు పాల్పడే వారిని నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ద్వారా అరెస్టు చేసి జీవిత ఖైదు విధించే విధంగా చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రాజకీయాలలో క్రైస్తవులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే స్థానాలను కేటాయించాలని కోరారు. ఈ నెల 11న విశాఖలోని గొల్లలపాలెం ఐపిసి చర్చిలో 500 మంది క్రైస్తవ ఆరాధకులతో గెట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ యజ్జల బాలరాజు మాట్లాడుతూ వచ్చే నెల 11న ఆల్ ఇండియా ఐక్య క్రైస్తవ జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.జార్జ్ బాబు, బిషప్ ఎల్.సామ్యూల్, డేవిడ్ రాజు, సామ్యూల్ సాంబ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్రైస్తవ జెఎసి చైర్మన్ బాబూరావు

పురిటి బిడ్డను అరచేత్తో పట్టుకుని... బైక్‌పై బాలింత ప్రయాణం

అత్యవసర వైద్యానికి గిరిపుత్రుల అగచాట్లు!

- ఎన్ని ఉదంతాలు వెలుగులోకి వచ్చినా... మెరుగుపడని పరిస్థితులు
- ఆవేదన చెందుతున్న గిరిజనులు

ప్రజాశక్తి - రోలుగుంట : అత్యవసర వైద్యానికి ఏజెన్సీలోని గిరిజనులు అనునిత్యం అగచాట్లు పడుతూనే ఉన్నారు. అనేకానేక ఉదంతాలు వెలుగులోకి వచ్చినప్పటికీ వీరికి అందించే వైద్యసేవల్లో గానీ,ఇతరత్రా సౌకర్యాల కల్పనల్లో ఇసుమంతైనా పురోగతి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాటికీ, నేటికీ మన్యవాసులకు అనారోగ్యం వచ్చిందంటే చాలు...డోలీ మోతలు,. కాలినడకన గర్భిణులు, బాలింతలు, ఇతరత్రా అనారోగ్య పీడితుల ప్రయాణాలు తప్పడం లేదు.అలాంటిదే మరో ఘటన వెలుగు చూడడం మరీ బాధాకరం.

అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం ఆర్ల పంచాయతీ పిత్రిగడ్డ అనే గ్రామం ఉంది. ఎత్తైన కొండల మధ్యనున్న ఆ గ్రామంలో 14 కుటుంబాలకు చెందిన 80మంది ఆదివాసీ కోందు తెగ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కొర్ర రూతు గర్భిణికి సోమవారం పురిటి నొప్పులు రాగా, ఆమెను ఆసుపత్రికి తరలించే పరిస్థితి లేకపోవడంతో గ్రామంలోనే ప్రసవానికి ప్రయత్నించగా, సోమవారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఇంట్లో డెలివరీ కావడంతో తల్లీబిడ్డకు మెరుగైన వైద్యసేవల కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు.

మంగళవారం ఉదయం రూతు భర్త లక్ష్మణరావు, కుటుంబ సభ్యుల సాయంతో రెండు ద్విచక్ర వాహనాలపై బాలింతను ఆసుపత్రికి తీసుకెళ్లారు. పచ్చి బాలింత రూతు, నవజాత శిశువును ఒడిలో పెట్టుకుని, తన భర్త బైక్‌పై వెనుకన కూర్చోగా, మరోబైక్‌తో కుటుంబీకులు వారిని అనుసరించగా, కొంతదూరం బైక్‌పైనే బిడ్డను చేత్తో మోసుకువెళ్లి, అక్కడి నుంచి ఆటోలో బుచ్చెంపేట పిహెచ్‌సికి తీసుకువెళ్లి ఆసుపత్రిలో చేర్పించారు.వైద్యపరీక్షల కోసం బాలింత, నవజాత శిశువు పడిన అవస్థలను చూసి పలువురు గిరిజనులు ఆవేదన చెందుతున్నారు.

అపుడే పుట్టిన బిడ్డను పట్టుకుని ఆసుపత్రికి వెళుతున్న రూతు

ఎన్నాళ్లీ అవస్థలు?

స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా తమకు అవస్థలు తప్పడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, అనారోగ్యపీడితులు ఆస్పత్రికి వెళ్లాలంటే నరకం చూస్తున్నారని వాపోతున్నారు. తమ గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవడంతో, తామే చందాలు వేసుకుని కొంతదూరం రోడ్డు వేసుకున్నామని అంటున్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ దరికి రావడం లేదని, జిల్లా యంత్రాంగం, రాజకీయ నేతలూ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆదివాసీలు గగ్గోలు పెడుతున్నారు. ఇకనైనా అధికారులు, నేతలు స్పందించకపోతే జిల్లా కలెక్టరేట్ వద్ద డోలీ మోతల ప్రదర్శనతో ఆందోళన వ్యక్తం చేస్తామని పిటిజి సంక్షేమ సంఘం, ఎపి గిరిజన సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు. గిరిజనులకు కనీస సౌకర్యాలు కోసం, వారి సమస్యల పరిష్కారానికి ఆందోళనను ఉధృతం చేస్తామని ఎపి గిరిజన సంఘం ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, గిరిజన సంఘ మండల కార్యదర్శి కొర్ర కృష్ణ హెచ్చరించారు.

వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షురాలికి సత్కారం

సుజాతను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ : వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన గొలుగొండ మండలం ఏఎల్ పురం సర్పంచ్ లోచల సుజాతను మంగళవారం ద్వారకానగరం గ్రామంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం సుజాత మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ గురుతర బాధ్యత అప్పగించడం ఆనందంగా ఉందని, నాయకుల సూచనల మేరకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, జెడ్‌పిటిసి సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ల అధ్యక్షులు పాణి శాంతారామ్, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

సమావేశంలో మాట్లాడుతున్న వెటర్నరీ ఎడి డాక్టర్ సింహాద్రప్పడు

ప్రజాశక్తి -కోటవురట్ల : పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను తప్పనరిగా వేయించడం ద్వారా వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను విజయవంతం నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సింహాద్రప్పడు కోరారు. మంగళవారం మండలపరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో కోటవురట్ల, మాకవరపాలెం మండలాల పశుసంవర్ధక శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ మార్చి ఒకటి నుంచి నిర్వహించనున్న గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్‌ను విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారుజ జీవాలకు నట్టల నివారణ మందులు సకాలంలో అందించాలన్నారు, గ్రామీణ ప్రాంతాలలో సంచార పశు ఆరోగ్యసేవ సిబ్బంది అందుబాటులో ఉన్నందున వీలైతే సిబ్బంది వైద్యులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ పడాల్,, సచివాలయ పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరులో డెంగీ కలకలం

- కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న బాలిక

ప్రజాశక్తి -సీలేరు : జికె.వీధి మండలం సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంపులో డెంగీ కేసు నమోదు కావడం తీవ్ర కలకలం రేపింది. స్థానిక పిహెచ్సి వైద్యాధికారి కె.సౌమ్య కథనం ప్రకారం... చింతపల్లి క్యాంపు గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక కిలో పార్వతి తీవ్ర జ్వరంరాగా, ఈనెల 22న ఆమె తల్లిదండ్రులు స్థానిక పిహెచ్‌సికి తీసుకొచ్చారు. పార్వతికి మలేరియా టెస్టు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది. సిబిసి టెస్టులు పిహెచ్‌సిలో అందుబాటులో లేకపోవడంతో ఏపీ జెన్కో ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ పరీక్ష చేయగా ప్లేట్లెట్స్ 38వేలకు పడిపోయినట్లు నిర్ధారణ అయింది. పార్వతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవ నిమిత్తం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించేందుకు సన్నాహాలు చేశారు. అక్కడి వెళ్లేందుకు పార్వతి తండ్రి శ్రీను, తల్లి నిరాకరించారు. కుమార్తె ఆరోగ్య పరిస్థితిపై కౌన్సిలింగ్ చేసి నచ్చజెప్పి చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి పార్వతిని తరలించారు. వైద్య సేవలు అందించినా ఆరోగ్య పరిస్థితి మెరుగు పడలేదు. వెంటనే విశాఖ కెజిహెచ్‌కు అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, డెంగీ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం పార్వతి కెజిహెచ్‌లో చికిత్స పొందుతోంది.

ఆరిలోవ అటవీ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-గొలుగొండ : ఆరిలోవ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఒక పెద్ద లారీ బ్రేక్ డౌన్ కావడంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. కేడిపేట నుంచి నర్సీపట్నం రాకపోకలు సుమారు గంటన్నర పాటు నిలిచిపోయాయి. కాగా ఈ ప్రాంతంలో రోడ్డు పాడై గుంతలు ఏర్పడడంతోపాటు రోడ్డు ఇరుకుగా ఉండడంతో తరచూ ఇటువంటి సంఘటనలు పునరావృతమవుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు వెడల్పు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు

అటవీ ప్రాంతంలో నిలిచిన వాహనాలు

వెంకన్న కల్యాణోత్సవాలకు ఉపమాక ముస్తాబు

- తుది దశకు చేరుకుంటున్న ఏర్పాట్లు

- తీర్థంలో షాపులు నిర్మించుకుంటున్న వ్యాపారులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఉపమాకవెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు అంతా ముస్తాబవుతోంది. ఉత్సవాలు ఈ నెల 2న ప్రారంభం కానుండగా, 3న స్వామి వార్షి కల్యాణం జరగనుంది. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎండ తీవ్రత లేకుండా ప్రధాన రాజగోపురం బయట విశాలమైన రెండు తాటాకు షెడ్లు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల భక్తులు ప్రదక్షిణ చేసే ఆస్థాన మండపం చుట్టూ క్లాత్ డెకరేషన్ చేశారు. కొండపైకి భక్తులు వెళ్లే మెట్లుమార్గంలో రెయిలింగ్ మరమ్మతు పనులు కూడా పూర్తి చేశారు. క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ అలంకరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి . ఐదు రోజుల పాటు స్వామికి విశేష సేవలు, తిరువీధి సేవలు జరిగే మాడవీధుల్లో కూడా విద్యుత్ అలంకరణ ఏర్పాటు చేస్తున్నారు. కల్యాణోత్సవాలకు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి.

తీర్థంలో దుకాణాల ఏర్పాటు

స్వామి కల్యాణోత్సవాల సందర్భంగా 18 రోజులపాటు తీర్థం జరగనున్నది. వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం రోజు నుంచి కొత్త అమావాస్య ముందు రోజు వరకూ జరిగే జాతర కోసం వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇప్పటికే వ్యాపారులు తాటికమ్మలతో పాకలు నిర్మించుకునే పనులు నిమగ్నమై ఉన్నారు

పాకలు ఏర్పాటు చేసుకుంటున్న వ్యాపారులు

.తీర్థంలో మసాలాసామగ్రి, పిల్లల ఆట వస్తువులు, ఇత్తడి సామాగ్రి, తినుబండరాల దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

నిరుపేద విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని మోదమాంబ హైస్కూల్ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. శ్రీ మోదమాంబ హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న విద్యార్థిని కె.లోహితకు రెండేళ్ల స్కూల్ ఫీజును అందజేశారు. మంగళవారం ఫీజు మొత్తాన్ని పాఠశాల ప్రిన్సిపల్ నాగమణిను కలిసి నగదును అందించారు. అంతేకాకుండా లోహిత 10వ తరగతి చదువు పూర్తి అయ్యేంతవరకు అయ్యే ఖర్చులకు ఆర్థిక సహాయం అందిస్తామని, బాధ్యతగా చదివిస్తామని ముందుకు వచ్చారు. పాఠశాల పూర్వ విద్యార్థుల ఔదార్యాన్ని పాఠశాల సిబ్బంది అభినందించారు. విద్యార్థిని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కనకమహాలక్ష్మి బ్యాంకుకు
తిరిగి ఎన్నికైన ముగ్గురు డైరెక్టర్లు

విజయసంకేతం చూపుతున్న మళ్లీ ఎన్నికైన డైరెక్టర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకులో ఖాళీ అయిన ముగ్గురు డైరెక్టర్ల పదవులకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పాత డైరెక్టర్లకే బ్యాంకు సభ్యులు పట్టంకట్టారు. బ్యాంకులో ఖాళీ అయిన ముగ్గురు డైరెక్టర్ స్థానాలకు నలుగురు పోటీ పడగా.. బొప్పూడి నాగేశ్వరరావు అత్యధిక ఓట్లు 404 సాధించి మొదటి స్థానంలో నిలవగా, డాక్టర్ మోటూరు శ్రీరామకృష్ణ 368, రాయల వెంకటేశ్వరరావు 342 ఓట్లు సాధించి రెండు, మూడు స్థానాలను పొంది డైరెక్టర్లుగా తిరిగి గెలుపొందారు. కాగా ఈ పోటీల్లో నిలబడిన యలమంచిలి సత్యకృష్ణ 164 ఓట్లను సాధించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఎన్నికలో మొత్తం 467 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, వాటిలో 463 ఓట్లు చెల్లుబాటయ్యాయి. గెలుపొందిన అభ్యర్థులకు ఎన్నికల అధికారి శంకర్ నియామక పత్రాలను అందజేశారు.

పిహెచ్‌సిలో ఆకస్మిక తనిఖీలు

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం : మండలంలోని సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సైతారుపేట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాన్ని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వీరాజ్యోతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో రికార్డులు, . అందుబాటులో ఉన్న మందులు, ల్యాబరేటరీలో ఉన్న కిట్లు, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్‌ఎంల రికార్డులు, ఎస్‌డిజి., సిడిఎన్. సర్వే టార్గెట్ గోల్స్ రికార్డులను, పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, వృద్ధులు,గర్భిణులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. డాక్టర్ శక్తి ప్రియ, ఎంఆర్. సఖి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆశిషన్ టోప్పో, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

లోవరాజుకు ఘననివాళి

నివాళులర్పిస్తున్న సర్పంచ్ తదితరులు

ప్రజాశక్తి-గొలుగొండ : అనారోగ్యంతో మృతి చెందిన గొలుగొండ మండలం సిహెచ్.నాగాపురం పంచాయతీ సెక్రటరీ దవల లోవరాజుకు పలువురు నివాళులర్పించారు. మంగళవారం సచివాలయంలో లోవరాజు చిత్రపటానికి సిహెచ్.నాగాపురం గ్రామ సర్పంచ్ యలమంచిలి రఘురామ్, కేడిపేట సెక్రటరీ ఏలూరి శ్రీను, పాత కేడిపేట సెక్రటరీ బి.కిరణ్మయి, సిబ్బందిి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, గజపతినగరం

ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, పెన్షనర్ల సమస్యలను, బాధలను నేడు వినేవారే కరువయ్యారని, ఇలాంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో అందరి గొంతుగా మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. చట్ట సభల్లో ప్రశ్నించి, డిమాండ్లను సాధించుకునేందుకు పిడిఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని విజ్జీ స్టేడియం, రాజీవ్‌గాంధీ స్టేడియంలో వాకర్స్‌ను, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ, నిరుద్యోగ యువతతో ర్యాలీ అవుతూ సమస్యలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అందర్నీ పలకరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నేడు ఉద్యోగుల సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టారని అన్నారు. ప్రచారంలో యువత, ఉద్యోగుల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు భద్రత ఏదీ?

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని రమాప్రభ అన్నారు. గజపతినగరంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి అధ్యాపకులను, యాజమాన్యాలను కలుసుకున్నారు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమబోర్డు, సహాయ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ నెరవేర్చుకోవాలంటే శాసనమండలిలో మన గొంతు వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ప్రజాసంఘాల నేతలు జి. శ్రీనివాస్, వి.లక్ష్మి, డి.రాము, ఎస్.బంగారునాయుడు, ఎన్.నాయుడు పాల్గొన్నారు.

విశాఖనగరంలో...

ఆరిలోవ : నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజాగొంతును వినిపించే ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సిపిఎం ఆరిలోవ జోన్ కమిటీ ఆధ్వర్యాన 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ల వద్దకు వెళ్లి కరపత్రాలు అందించి, రమా ప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శంకరరావు, ఎఐటియుసి నాయకులు రమణ, కాసు నాయుడు, రాగోలు గణపతి పాల్గొన్నారు.

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గొలగాని అప్పారావు పిలుపునిచ్చారు. జివిఎంసి 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ ఏరియా కార్మికులతో మంగళవారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మన కుటుంబీకుల్లో డిగ్రీ చదివి ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకున్న వారు ఉంటే డాక్టర్ కోరెడ్ల రమాప్రభకి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని చెప్పాలని కోరారు. మన భవిష్యత్తును ఈ ఓటు మారుస్తుందన్నారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.గణేష్, రాజారావు, సూర్యకాంతం, నూకరాజు, శ్రీను, పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన..

ఎంవిపి.కాలనీ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో మంగళవారం ఎంవిపి సెక్టార్ -1లో ప్రచారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు జి.వామనమూర్తి మాట్లాడుతూ చట్టసభల్లో ఉత్తరాంధ్ర గొంతు వినిపించేందుకు రమాప్రభను గెలిపించాల్సిన అవసరముందన్నారు. సిపిఐ నాయకులు రవికృష్ణ, ఆటో సంఘం నాయకులు బుల్లిబాబు పాల్గొన్నారు.

అల్లూరి జిల్లాలో...

పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు మాతృభాషా వాలంటీర్ల మద్దతు

జి.మాడుగుల : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని మాతృభాష వాలంటీర్ల సంఘం జిల్లా కార్యదర్శి కొర్ర సర్బునాయుడు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్ కోరారు. మండలంలోని పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. అలాగే మాతృభాషా వాలంటీర్ల సంఘం సమావేశంలో పాల్గొని, మాట్లాడుతూ, ఏటా భాషావాలంటీర్ల రెన్యువల్, కనీస వేతనం అమలు, ఇతర సమస్యల పరిష్కారానికి భాషా వాలంటీర్ల తరపున శాసనమండలిలో గళం వినిపించడానికి, ప్రభుత్వం, అధికారులతో పోరాడడానికి కోరెడ్ల రమాప్రభను గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మాతృభాషా వాలంటీర్లు పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభకు తమ మద్దతు ప్రకటించారు. మాతృభాష వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షురాలు ఎస్.చిన్నమ్మి మండల కార్యదర్శి పి.కేశవరావు కోశాధికారి పి.కృష్ణకుమార్ నాయకులు అప్పలరాజు, చిన్నబ్బాయి పాల్గొన్నారు

ప్రజాసంఘాల విస్తృత ప్రచారం

అనంతగిరి : ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ మంగళవారం గిరిజన సంఘం ఆధ్వర్యన జెడ్‌పిటిసి దీసరి గంగరాజు విస్తృతంగా ప్రచారం చేశారు. పలు పాఠశాలలు, కార్యాలయాల్లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి, కరపత్రాలను అందజేసి, ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే డాక్టర్ కోరెడ్ల రమాప్రభను ప్రథమ ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ఎస్. నాగులు, జె. సుబ్బారావు, జె.రామన్న పాల్గొన్నారు

అనకాపల్లి జిల్లాలో...

రాంబిల్లి : ప్రజా సంఘాలు బలపరచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటును గెలిపించాలని స్థానిక ప్రజా సంఘాల నేతలు ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం వారు మండలంలోని నేవీకాలనీ, కొప్పుగొండుపాలెం, చినకలవలాపల్లి, కొత్తపేట, కొండవారపాలెం గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్ల ఇళ్లకు వెళ్లి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.నారాయణరావు, సిహెచ్ శివాజీ, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చోడిపిల్లి గంగరాజు, డివైఎఫ్ఐ నాయకుడు సిహెచ్ నూకన్న, సిఐటియు నాయకులు సమ్మెట వర్మ పాల్గొన్నారు.

గాజువాకలో ప్రజాసంఘాల నాయకుల ప్రచారం

ఎంవిపి కాలనీలో ఎఐటియుసి నేతల ప్రచారం

అనంతగిరిలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

జి.మాడుగులలో మాతృ భాషా వాలంటీర్ల సంఘీభావం

రాంబిల్లిలో ప్రజా సంఘాల నేతల ప్రచారం

నక్కపల్లి ప్రభుత్వాసుపత్రిలో
ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుచేసి ఈ ప్రాంత ప్రజలకు, ప్రమాదాల బారినపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం అందించి, ప్రాణాలు కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్ కోరారు. మంగళవారం అనకాపల్లిలో వైద్య విధాన పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.తుని తాండవ బ్రిడ్జి నుంచి యలమంచిలి వరకు జాతీయ రహదారిపై నిరంతరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ ప్రాంతాన్ని యాక్సిడెంట్ జోన్‌గా ప్రభుత్వం ఇప్పటికే గుర్తించిందన్నారు. ఇక్కడ జరుగుతున్న ప్రమాదాల్లో క్షతగాత్రులను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుంటారన్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో వైద్యులు ప్రాథమిక వైద్యం చేసి, మెరుగైన వైద్యం అందించడానికి సౌకర్యాలు లేని కారణంగా క్షతగాత్రులను అనకాపల్లి, విశాఖపట్నం కెజిహెచ్‌కు రిఫర్ చేస్తున్నారన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు మార్గం మధ్యలోనే మరణించిన సందర్భాలు అనేకం చోటుచేసుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు
నక్కపల్లి ఆసుపత్రి పరిధిలో ఉన్న జాతీయరహదారిపై జరుగుతున్న ప్రమాదాల్లో బాధితుల ప్రాణాలను కాపాడాలంటే వారికి మెరుగైన వైద్యం కోసం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు అవసరం ఎంతో ఉందన్నారు. అలాగే నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రెండేళ్లుగా రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు పెట్టడం లేదని, దీని కారణంగా పేదలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేత లోకనాథం, తదితరులు